సాక్షి
మంచిర్యాల
శనివారం । 21 । డిసెంబర్ । 2024



గురుకులం పిలుస్తోంది..

ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి నిర్వహించనున్న పరీక్ష(వీటీజీ సెట్)కు నోటిఫికేషన్ విడుదలైంది. ఉమ్మడి జిల్లాలో 5,920 సీట్లు ఉన్నాయి. 8లో▸



అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలు

అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని పలు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాలో నిరసన వ్యక్తం చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0 /20.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రాత్రివేళ చలి తీవ్రత పెరుగుతుంది.

సర్కారు జాగా అమ్మేశారు!



సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు రెవెన్యూ అధికారుల లేఖ



శ్రీనివాస కాలనీలో ఓ అపార్ట్‌మెంట్ పక్కనే 324సర్వే నంబరు ప్రభుత్వ భూమిగా తెలిపే హద్దురాయి

- 324 సర్వే నంబరులో ప్రభుత్వ భూమి మాయం
- ఎకరాల కొద్దీ చెరబట్టి, రూ.కోట్ల సంపాదన
- తాజాగా ఆ లావాదేవీలపై అధికారుల దృష్టి
- చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ ఆదేశాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని సర్కారు భూములు కొందరికి ఫలహారంగా మారిపోయాయి. తమ పలుకుబడితో పట్టణ నడిబొడ్డున రూ.కోట్ల విలువైన భూములను చెరబట్టారు. సర్కారు భూములను విక్రయించి అనతికాలంలోనే అందనంత ఎత్తుకు ఎదిగిపోయారు. జిల్లా కేంద్రంలోని సర్వేనంబరు 324 మంచిర్యాల శివారు ఏసీసీ, శ్రీనివాస కాలనీ పరిధిలో ఉన్న సర్కారు భూమిని కొందరు తెలివిగా కబ్జా చేసి అమ్మేశారు. ఇండిపెండెంట్ ఇళ్లు, అపార్టుమెంట్లు కట్టేసి రూ.కోట్లు సంపాదించారు. అప్పటి రెవెన్యూ అధికారుల సాయంతో దందా నడిపించారు. ప్రస్తుతం వాగుకు సమీపంలో అక్కడక్కడ మాత్రమే ఈ సర్వే నంబరులో కొంతమేర భూమి మిగిలి ఉంది. ప్రధాన రహదారికి కూతవేటులో ఉన్న లావుణి పట్టా, ప్రైవేటు, సర్కారు సర్వే నంబర్లు చూపిస్తూ రూ.కోట్ల భూమిని కాజేశారు. అప్పట్లోనే ఈ సర్వేనంబరుపై రాష్ట్ర స్థాయిలో విజిలెన్స్ విచారణ దాకా వెళ్లింది. తర్వాత మరుగున పడింది. ప్రస్తుతం ఈ సర్వే నంబరుపైనే మళ్లీ విచారణ మొదలవడంతో అక్రమార్కులపై చర్యలు ఉంటాయనే సంకేతాలు వస్తున్నాయి.

సర్కారు, లావుణి పట్టా భూముల్లో పాగా

మంచిర్యాల మండల రెవెన్యూ రికార్డుల ప్రకారం 324 సర్వేనంబర్‌లో 117.04 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ మొత్తంలో నిజాం కాలంలో జంగు సిపాయికి 60ఎకరాలు ఇచ్చింది. మళ్లీ ప్రభుత్వం ఆ భూమిని వెనక్కి తీసుకుని ఏసీసీకి కేటాయించింది. మిగతా 57.04 ఎకరాల్లో 34.15ఎకరాలను 2000సంవత్సరంలో 8మందికి లావుణి పట్టా(అసైన్డ్) చేశారు. మరో 22.29 ఎకరాల భూమి మిగిలి ఉండాలి. అయితే అప్పటి గత ప్రభుత్వంలో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు కబ్జా చేసి విక్రయించేశారు. ఆయన భూ దందాపై అప్పట్లోనే సీఎంవో దాకా ఫిర్యాదులు వెళ్లడంతో నాటి ఆర్డీఓ అయిషా మస్రత్ ఖానం సర్వే చేయించారు. మొత్తం విస్తీర్ణంలో పెద్ద హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ హద్దు రాళ్లు చాలా చోట్ల కనుమరుగయ్యాయి. మరోవైపు 34.15ఎకరాల అసైన్డ్ భూమిని కూడా గత అధికార పార్టీ నాయకులు తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్లాట్లు చేసి విక్రయించినట్లు ఆరోపణలున్నాయి.

క్రిమినల్ కేసులకు కలెక్టర్ ఆదేశాలు

324 సర్వేనంబరులో జరిగిన లావాదేవీలపై కలెక్టర్ కుమార్ దీపక్ తీవ్రంగా పరిగణించారు. జనవరి 1, 2024నుంచి ఇప్పటి వరకు ఎన్ని క్రయవిక్రయాలు జరిగాయో వివరాలు తీసుకోవాలంటూ మంచిర్యాల తహసీల్దార్‌ను ఆదేశించారు. దీంతో మంచిర్యాల రెవెన్యూ అధికారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇటీవలే ఓ లేఖ రాశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి స్పందన లేకపోవడంతో ఈ నెల 18న మరోసారి లేఖ రాశారు. కానీ ఇంకా అధికారులకు సమాధానం రావడం లేదు. ఆ సమయంలో ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్లు ఎవరున్నా, వారిపై చర్యలు తీసుకునేలా సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు ముందుకు సాగే అవకాశం ఉంది.

బినామీ పేర్లతోనే దందా

ప్రస్తుతం 324 సర్వే నంబరులో కాలనీలు వెలిశాయి. భూమికి డిమాండ్ పెరిగింది. గతంలో లావుణి పట్టా పొందిన వ్యక్తుల నుంచి తక్కువ ధరకు కొన్నారు. అప్పటి పురపాలక సంఘంలో కీలక నేత బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్లు చేయించారు. దాదాపు 20 ఎకరాలకు పైగా ఈ సర్వే నంబర్‌లోని భూములు సదరు నాయకుడు చెరబట్టారని ఎవరిని అడిగినా చెబుతారు. ఇందుకోసం సర్వే నంబరు 324 లోని రెండు బై నంబర్లలో సుమారు 12.30ఎకరాలు తమ వారి పేరుతో రిజిష్టర్ చేయించుకుని భూదందా సాగించారు. అదే నాయకుడికి చెందిన మరో బినామీ పేరు మీదుగా కూడా కాసిపేట మండల పరిధి పెద్దనపల్లిలో భూములు ఉన్నాయి.

పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

- కలెక్టర్ కుమార్ దీపక్
- గ్రామాల్లో సర్వే పరిశీలన



బెల్లంపల్లిలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి/భీమిని: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించి లబ్ధిదారుల వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం ఆయన బెల్లంపల్లి పట్టణంలోని 1, 4, 11, 20వ వార్డుల్లో, కన్నెపల్లి మండలం జన్కాపూర్, జజ్జరవెల్లి, కన్నెపల్లి గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. భీమిని మండలంలో సర్వే ఆలస్యంపై ఎంపీడీవో శంకర్‌ను ప్రశ్నించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా అందజేసిన దరఖాస్తుదారుల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. పెద్ద గ్రామ పంచాయతీల్లో సిబ్బంది సంఖ్య పెంచి సర్వే పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం జజ్జరవెల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. నూతన కామన్ మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని, వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ శ్వేత, కౌన్సిలర్లు, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఏపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



హస్తకళ కార్డులు అందజేస్తున్న దివ్యారావు

నస్పూర్: మహిళల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ చేతివృత్తుల డైరెక్టర్ దివ్యారావు తెలిపారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నస్పూర్ కాలనీలోని సేవా భవన్‌లో నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ కేంద్రాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. శిక్షణ అభ్యర్థులకు హస్తకళ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హస్తకళ కార్డులు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్డుల ద్వారా మహిళలు దేశవ్యాప్తంగా వారి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రిత్వ శాఖ డిజైనర్ రాజేశ్, మందమర్రి డీవైపీఎం ఆసిఫ్, సీనియర్ పీఓ కాంతారావు, సేవా సెక్రెటరీ కొట్టె జ్యోతి పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో అలసత్వం వద్దు

- రామగుండం సీపీ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీపీ

మంచిర్యాలక్రైం: శాంతిభద్రతల పరిరక్షణలో అలసత్వం వహించొద్దని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా పరిధిలోని డీసీపీ, ఏసీపీ, ఎస్‌హెచ్‌ఓలతో వార్షిక నేర సమీక్ష సమావేశం జూమ్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ మహిళల కేసులు, పోక్సో కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని అన్నారు. నేరాల తీరు, ఎక్కువగా నేరాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అసాంఘిక శక్తులు, మావోయిస్టులపై దృష్టి కేంద్రీకరించి కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్, నిరంతర పెట్రోలింగ్, ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టాలని అన్నారు. మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో పెద్దపల్లి డీసీపీ చేతన, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, కమిషనరేట్ పరిధిలో ని ఏసీపీలు, ఏఆర్ ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల ర్యాలీ



సంఘీభావంగా పాల్గొన్న సీపీఐ నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మెలో భాగంగా 11వ రోజు శుక్రవారం కలెక్టరేట్ నుంచి జాతీయ రహదారి వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ జేఏసీ అధ్యక్ష, ప్రధాన, కార్యదర్శులు సుమలత, టి.రాజన్న మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని గత పదకొండు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. చాలీచాలని వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోయినా ఏళ్ల తరబడిగా విధులు నిర్వర్తిస్తున్నామని, ఎన్నికలకు ముందు అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, వెంటనే న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు సీపీఐ, ఎంఆర్పీఎస్ నాయకులు బద్రి సతీష్, సమ్మయ్య, తదితరులు సంఘీభావం తెలిపారు.

సైన్స్ ఉపాధ్యాయుల సెమినార్

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ రాష్ట్ర విద్యావైజ్ఞానిక శిక్షణ, పరిశోధన సంస్థ ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో మన సైన్స్ అనే అంశంపై సైన్స్ ఉపాధ్యాయులకు సెమినార్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సెమినార్ ఉంటుందని పేర్కొన్నారు. సైన్స్ బోధన సాధనంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చర్య, ప్రభావం, ఎకోలాజికల్ బ్యాలెన్స్, స్కూల్‌లో సస్టైనబుల్ ఎకో సిస్టమ్ మేనేజ్‌మెంట్ వ్యూహాలు, సైన్స్‌లో విద్యాప్రమాణాలు మెరుగుపర్చడానికి శాస్త్రీయ మార్గాలు, కొత్త బోధన పద్ధతులపై సైన్స్ ఉపాధ్యాయులు, ఎన్‌జీవో నుంచి సెమినార్ పత్రాలు జనవరి 20వరకు సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మధుబాబును సంప్రదించాలని సూచించారు.

బడి.. నిర్వహణ నిధులేవి..!

- స్కూల్ గ్రాంటు మంజూరులో జాప్యం
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది



దొనబండలో మొక్కలకు నీరు పడుతున్న సిబ్బంది

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులకు మంజూరయ్యే ప్రత్యేక గ్రాంటు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. నాలుగు నెలలుగా స్కూల్ స్పెషాలిటీ మెయింటనెన్స్ గ్రాంటు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ, స్థానిక సంస్థల(జెడ్పీ), మోడల్ స్కూళ్లలో మరుగుదొడ్లు, ఆవరణ శుభ్రత, మొక్కలకు నీరు పోయడానికి పాఠశాల సౌకర్యాల నిర్వహణ గ్రాంటు అందించాల్సి ఉంది. పిల్లల సంఖ్యను బట్టి నెలకు కనిష్టంగా రూ.3వేల నుంచి రూ.20వేల వరకు నిధులు కేటాయించింది. దీంతో ఆయా పాఠశాలల పారిశుద్ధ్య నిర్వహణ పనులకు పూర్తి సమయం, తాత్కాలిక పద్ధతిలో సిబ్బందిని నియమించి పనులు చేపట్టారు. జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్(డీఎంఎఫ్‌టీ) నుంచి నిధులు జమ కాకపోవడంతో వేతనాల చెల్లింపుల్లో జాప్యం వల్ల పారిశుద్ధ్య నిర్వహణ సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ప్రత్యేక నిధులు వస్తేనే..

పారిశుద్ధ్య నిర్వహణకు సిబ్బందిని నియమించాలని ఎప్పటి నుంచో ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. గత ప్రభుత్వం పంచాయతీలు, మున్సిపాల్టీలకు పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతను అప్పగించినా పనులు అంతంత మాత్రంగానే సాగాయి. దుర్వాసన వచ్చే మరుగుదొడ్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం బడి బాధ్యతలను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించి ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య పనుల కోసం స్కూల్ స్పెషాలిటీ మెయింటనెన్స్ గ్రాంటు మంజూరుకు నిర్ణయించింది. జిల్లా మినరల్ ఫండ్ ట్రస్టు(డీఎంఎఫ్‌టీ) నుంచి ముందస్తుగా మూడు నెలలకు సంబంధించిన నిధులు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఖాతాలో జమ చేయాలని ఆదేశాలు వచ్చాయి. జిల్లాలోని 719 పాఠశాలలకు ప్రత్యేక గ్రాంటు విడుదల అయ్యాయి. 1నుంచి 30 మంది వరకు విద్యార్థులుంటే రూ.3వేలు, 31నుంచి 100 వరకు రూ.6వేలు, 101 నుంచి 250 వరకు విద్యార్థులకు రూ.8వేలు, 251నుంచి 500 వరకు రూ.12వేలు, 501 నుంచి 750 వరకు రూ.15వేలు, 750పైన విద్యార్థులున్నా పాఠశాలకు రూ.20వేలు ప్రతీ నెల చెల్లించాలి. ఈ నేపథ్యంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పర్యవేక్షణలో పాఠశాలల పరిసరాలు, తరగతి గదులు, మూత్రశాలలు శుభ్రచేయడం, మొక్కలకు నీరు పోయడం వంటి పనుల కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించడంతో పనులు సాగుతున్నాయి. విద్యా సంవత్సరంలో 10నెలలు పాటు గ్రాంటు చెల్లించడం.. ముందస్తుగా మూడు నెలల గ్రాంటు అమ్మ ఆదర్శ కమిటీ ఖాతాలో జమ చేయాల్సి ఉంది. అప్పుడే నాలుగు నెలలు గడిచిపోతున్నా నిధులు విడుదల కాకపోవడంపై పారిశుద్ధ్య సిబ్బందిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. వేతనాల కోసం పాఠశాల హెచ్‌ఎంలపై ఒత్తిడి పెరుగుతుండడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి. పాఠశాలల్లో పనిచేసే పారిశుద్ధ్య సిబ్బందికి వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

త్వరలోనే జమ

పాఠశాల పారిశుద్ధ్య పనుల నిర్వహణ కోసం ప్రత్యేక నిధులు త్వరలోనే అమ్మ ఆదర్శ కమిటీ ఖాతాలో జమ కానున్నాయి. నిధుల విషయమై చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్(సీపీవో) దృష్టికి తీసుకెళ్లాం.

– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

కార్పొరేషన్‌గా మంచిర్యాల



మంచిర్యాల పట్టణం

- అసెంబ్లీలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటన
- ప్రతిపాదనలు పంపించిన అధికారులు
- నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్‌లోని కొన్ని గ్రామాలు విలీనం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల గ్రేడ్–1 మున్సిపాల్టీ మున్సిపల్ కార్పొరేషన్‌గా మారనుంది. ఈ మేరకు అసెంబ్లీలో మంత్రి శ్రీధర్‌బాబు ఓ ప్రకటన చేశారు. అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉంది. పదేళ్ల క్రితమే మంచిర్యాలను కార్పొరేషన్‌గా మార్చాలని భావించినా కార్యరూపం దాల్చలేదు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త మున్సిపాలిటీల ఏర్పాటులో భాగంగా నస్పూర్, క్యాతన్‌పల్లి గ్రామ పంచాయతీలు మున్సిపాల్టీగా మారాయి. ఈ రెండింటినీ మంచిర్యాలలో విలీనం చేసి కార్పొరేషన్‌గా మార్చాలని గతంలోనే అధికారులు భావించారు. అనివార్య కారణాలతో బ్రేక్ పడింది. గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు ఇచ్చిన హామీ మేరకు కార్పొరేషన్‌గా మార్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. అందులో భాగంగానే ప్రభుత్వ స్థలాలు, భవనాల గుర్తింపుతోపాటు ఖాళీ స్థలాలు, ఇళ్లు వంటి వివరాలు సేకరించారు. గత ప్రతిపాదనల్లో చెన్నూరు నియోజకవర్గంలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో కొంతభాగాన్ని మంచిర్యాలలో కలుపుతారని అనుకున్నా.. కేవలం మంచిర్యాల నియోజకవర్గానికి సంబంధించిన వాటినే కార్పొరేషన్‌లో విలీనం చేసే దిశగా అధికారులు కసరత్తు చేశారు.

పట్టణం, గ్రామాలు విలీనం

నస్పూరు మున్సిపాలిటీ, హాజీపూర్ మండలంలోని కొన్ని గ్రామాలను కలుపుకొని తయారు చేసిన కార్పొరేషన్ ప్రతిపాదిత చిత్రం సిద్ధమైంది. దాదాపుగా ఇదే తరహాలో మంచిర్యాల కార్పొరేషన్ ఏర్పాటుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేయగా, మంచిర్యాల, నస్పూరు మున్సిపాలిటీలతోపాటు హాజీపూర్ మండలం వేంపల్లి, కొత్తపల్లి, ముల్కల్ల, పోచంపహాడ్, గుడిపేట్, నంనూరు, నర్సింగాపూర్, చందనాపూర్ గ్రామాలను విలీనం చేసేలా మ్యాప్ రూపొందించారు. ఇప్పటికే నివేదికను ఉన్నతాధికారులకు అందించగా, ఏవైనా మార్పులు చేస్తే మ్యాప్ కూడా మారే అవకాశం ఉంది. మంచిర్యాల మున్సిపాలిటీలో 2011 జనాభా లెక్కల ప్రకారం 1,63,374 మంది ఉండగా, ప్రస్తుతం 2.50 లక్షల మంది ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. నస్పూరు మున్సిపాల్టీ, విలీనం చేసే గ్రామ పంచాయతీలను కలిపితే జనాభా దాదాపుగా 4లక్షల వరకు చేరనుంది. కార్పొరేషన్‌గా మారితే అభివృద్ధి పనులకు అధికంగా నిధులు కావాల్సి వస్తుంది. మంచిర్యాల మున్సిపాలిటీ కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్ 2.0కు ఎంపిక కాగా, కేంద్రం నుంచి వచ్చే నిధులతో అభివృద్ధికి ఆటంకం లేకుండా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

క్రీడల్లో రాష్ట్రస్థాయిలో రాణించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలటౌన్: జిల్లాలో నిర్వహిస్తున్న సీఎం కప్ జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొంది, రాష్ట్రస్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఉషోదయ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి రన్నింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి కీర్తి రాజ్‌వీరు, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

నేడు విజేతలకు బహుమతులు

జిల్లాస్థాయి సీఎం కప్ పోటీల విజేతలకు ఈ నెల 21న సాయంత్రం 3 గంటలకు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాజ్‌వీర్ ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్, ఖోఖో, కబడ్డీ, నెట్‌బాల్, యోగ, బాక్సింగ్, బాస్కెట్ బాల్, కిక్ బాక్సింగ్, రెజ్లింగ్, చెస్, కరాటే, జూడో, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, వివిధ క్రీడాంశాల విజేతలు హాజరుకావాలని తెలిపారు.



పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను ఈ నెల 31లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో ముఖ్య ప్రణాళిక అధికారి సత్యంతో కలిసి పంచాయతీరాజ్, రోడ్లు, భవనాల శాఖల అధికారులతో జిల్లాలో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మురుగు కాల్వలు, అంతర్గత రహదారులు, సెప్టిక్ ట్యాంక్‌లు, కల్వర్టులు, ప్రహరీలు, కమ్యూనిటీ భవనాల నిర్మాణాలు పూర్తి చేసేలా ప్రతీరోజు పురోగతిని పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ ఎం.స్వామిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపం లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హరీశ్‌రాజ్

మంచిర్యాలటౌన్: జిల్లాలో పౌష్టికాహార లోపంతో బాధపడే ఐదేళ్లలోపు పిల్లల వివరాలను స్యామ్‌మామ్ ద్వారా నమోదు చేసి వారిలో పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, స్టాఫ్‌నర్సులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పిల్లల వివరాల నమోదు కోసం ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. అంగన్‌వాడీ అధికారులు, టీచర్లతో సమన్వయం చేసుకుంటూ పౌష్టికాహార లోపం ఉన్న వారి వివరాలు తీసుకుని సంక్షేమశాఖతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. మాతాశిశు ఆరోగ్య సంరక్షణలో భాగంగా గర్భిణుల వివరాలు నమోదు చేయాలని, ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, 102 వాహనం ద్వారా గర్భిణులను ఇంటి నుంచి ఆసుపత్రులకు తీసుకు రావాలని తెలిపారు.

రైతుల ఖాతాల్లో రూ.51.73 కోట్లు జమ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన రూ.51.73 కోట్ల నగదు సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేశామని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 41,307 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, ఇందులో 9,799 మెట్రిక్ టన్నులు సన్నరకం ధాన్యం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో 22 రైస్‌మిల్లులకు సీఎంఆర్ అనుమతి జారీ చేశామని తెలిపారు. 3,436 మంది రైతుల ఖాతాల్లో రూ.51.73 కోట్లు జమ చేశామని వివరించారు. రైతులు ప్రభుత్వ రంగ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

రిటైర్డ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

రామకృష్ణాపూర్: రిటైర్డ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం కృషి చేస్తోందని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన రిటైర్డ్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి రిటైర్డ్ కార్మికులు చాలీచాలని పింఛన్‌తో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పింఛన్ పెంపు కోసం తమ సంఘం ఆరేడేళ్లుగా పోరాడుతోందని, తక్కువ పింఛన్ పొందుతున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పింఛన్ ఇప్పించేలా కృషి చేస్తామని తెలిపారు. రిటైర్డ్ కార్మికులకు 10వ వేజ్‌బోర్డులో పెంచిన గ్రాట్యుటీని ఇచ్చేలా యూనియన్ కృషి చేస్తోందని పేర్కొన్నారు. గ్రాట్యుటీ విషయంలో 2017 నుంచి అధికారులకు ఇస్తున్న విధంగానే కార్మికులకు కూడా ఇవ్వాలని అన్నారు. గోల్డెన్ హ్యాండ్ షేక్ ద్వారా రిటైర్ అయిన వారికి కూడా హెల్త్‌కార్డు పొందేందుకు మార్చి 2025వరకు అవకాశం కల్పించారని తెలిపారు. కంపెనీ ఖాళీ క్వార్టర్లు రిటైర్డ్ కార్మికులకు ఇప్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ, ఇప్పకాయల లింగయ్య, రామడుగు లక్ష్మణ్, మిట్టపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాసరలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పూజలు


పూజలో పాల్గొన్న కుటుంబ సభ్యులు

బాసర: బాసరలో శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని శుక్రవారం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు చేశారు. అర్చకుడు ప్రవీణ్ పాటక్ ఆధ్వర్యంలో ఆయన మనుమడు శ్రీరామ దేవేందర్‌రెడ్డికి అక్షరాభ్యాసం నిర్వహించారు. ఆలయ అధికారులు ముందుగా వారికి స్వాగతం పలికారు. పూజలు అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. తహసీల్దార్ పవన్‌చంద్ర, పోలీసులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

కలప పట్టివేత


పట్టుబడ్డ కలప

నస్పూర్: పట్టణ పరిధిలో విలేజ్ శ్రీరాంపూర్‌లోని ఓ విస్తారాకుల తయారీ ఫ్యాక్టరీలో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను హైదరాబాద్ ఫారెస్టు విజిలెన్స్, మంచిర్యాల ఫారెస్టు ఫ్లైయింగ్ స్క్వాడ్, ఫారెస్టు అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు ఫ్యాక్టరీపై దాడి చేసి, కలపను స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ అధికారి నరేందర్ తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 3 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. మంచిర్యాల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి రమాదేవి, మంచిర్యాల ఫారెస్టు రేంజ్ అధికారి రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

గుడిహత్నూర్: మండలంలోని మాన్కాపూర్‌లో కుమ్ర హన్మంతు ఇంట్లో గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు హన్మంతు ఇంటిని శుక్రవారం సోదా చేయగా రూ.20వేల విలువ చేసే 800 గ్రాముల గంజాయి లభ్యమైంది. గ్రామ సమీపంలో ఉన్న తన చేనులో గంజాయి సాగైనట్లు తన అవసరానికి దీన్ని విక్రయించడానికి ఉంచినట్లు హన్మంతు అంగీకరించారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

బోథ్: మండలంలోని పొచ్చెర బస్టాండ్ సమీపంలో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ వెంకటేశ్వర రావు, ఎస్సై ప్రవీణ్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. బోథ్ నుంచి పొచ్చెర జలపాతం వరకు శుక్రవారం ఉదయం ఎస్సైతోపాటు ముగ్గురు కానిస్టేబుళ్లు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. పొచ్చెర బస్టాండ్ వద్ద బస్సి చందర్ సింగ్ అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులను చూసి పరుగులు తీయగా ఎస్సై పట్టుకున్నాడు. అతని వద్ద ఉన్న నల్లని కవర్‌లో చూడగా 480 గ్రాముల గంజాయి లభ్యమైంది. దీని విలువ రూ.12 వేలు ఉంటుంది. నిందితుడు బస్సి చందర్ సింగ్‌ది నేరడిగొండ మండలం బుద్దికొండ పంచాయతీ పరిధిలో గల రాజులతండా గ్రామం. అతన్ని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. గంజాయిని ఎవరికి సరఫరా చేస్తున్నారో విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.

గురుకులం పిలుస్తోంది..

- 5వ తరగతిలో ప్రవేశాలకు ఆహ్వానం
- ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తుకు గడువు
- 23న ప్రవేశపరీక్ష


బెల్లంపల్లిలోని జనరల్ బాలుర గురుకుల పాఠశాల

బెల్లంపల్లి: ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించనున్న ఉమ్మడి ప్రవేశపరీక్ష (వీటీజీ సెట్) నోటిఫికేషన్ విడుదలైంది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) కార్యదర్శి, చీఫ్ కన్వీనర్ అలగు వర్షిణి నోటిఫికేషన్‌ను జారీ చేశారు. దీని ఆధారంగా ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించిన మెరిట్ విద్యార్థులకు 2025–26 విద్యా సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ప్రవేశం కల్పిస్తారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఆంగ్లమాధ్యమంలో మెరుగైన విద్యాబోధన చేపడుతారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీస్తూ వారిని సన్నద్ధం చేయనున్నారు.

ప్రవేశం కల్పించనున్న గురుకులాలివే..

వీటీజీ సెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి గురుకుల విద్యాసంస్థల్లో అడ్మిషన్ కల్పిస్తారు. మెరిట్ మార్కుల ప్రాతిపదికన టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, టీజీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, టీజీఆర్‌ఈఐఎస్ (ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్) ఆయా సంక్షేమ శాఖల ద్వారా నిర్వహిస్తున్న గురుకులాలకు ఎంపిక చేస్తారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉచిత భోజన, వసతి ఇతర సౌకర్యాలు కల్పిస్తారు. గురుకుల విద్యాసంస్థల్లో ఏటా ఉమ్మడి ప్రవేశపరీక్షకు లక్షలాది విద్యార్థులు పోటీపడటం జరుగుతోంది. ఈసారి కూడా మరింత పోటీ ఉండే అవకాశాలు ఉన్నాయి.

ఫిబ్రవరి 1 దరఖాస్తుకు అవకాశం

ఉమ్మడి గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి విద్యార్థులు ఈనెల 21 నుంచి వచ్చే ఏడాది (2025) ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తు చేసుకోవడానికి తుది గడువు విధించారు. ఆన్‌లైన్‌లో రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఒక సెల్ నంబర్‌తో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవల్సి ఉంటుంది. విద్యార్థుల ఎంపికకు పాత జిల్లా ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తమకు బదులు వేరే వారి ఫొటోలు పెట్టి దరఖాస్తు చేసినట్లయితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారు.

ఉమ్మడి జిల్లాలోని గురుకులాలు

జిల్లా	గురుకుల సొసైటీ	గురుకులాలు
మంచిర్యాల	టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్	09
మంచిర్యాల	ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	08
మంచిర్యాల	టీజీఆర్‌ఈఐఎస్	01
కుమురం భీం	టీజీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	10
కుమురం భీం	టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్	05
కుమురం భీం	ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	05
ఆదిలాబాద్	టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్	03
ఆదిలాబాద్	ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	06
ఆదిలాబాద్	టీజీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	13
నిర్మల్	టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్	05
నిర్మల్	ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	07
నిర్మల్	టీజీఆర్‌ఈఐఎస్	01
నిర్మల్	టీజీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	01

సద్వినియోగం చేసుకోవాలి



ఐదో తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి నోటిఫికేషన్ వచ్చేసింది. ప్రస్తుతం నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – డి.శ్రీధర్, సంక్షేమ బాలుర గురుకుల సీవోఈ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, బెల్లంపల్లి

23న ప్రవేశపరీక్ష

ఉమ్మడి గురుకులాల్లో నిర్వహించే ప్రవేశపరీక్ష వచ్చే ఏడాది ఫిబ్రవరి 23న ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు.

ఒక్కో గురుకులంలో 80 సీట్ల చొప్పున..

ఆయా గురుకుల విద్యాసంస్థల్లో ఐదో తరగతిలో ఏ,బీ సెక్షన్లు ఉన్నాయి. ఒక్కో సెక్షన్‌కు 40 మంది చొప్పున విద్యార్థులకు అడ్మిషన్ కల్పిస్తారు. ఆ ప్రాతిపదికన ఒక్కో గురుకులంలో రెండు సెక్షన్లను కలిపి గరిష్ఠంగా 80 సీట్లు భర్తీ చేస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 74 గురుకుల విద్యాసంస్థలు ఉండగా వీటన్నింటిలో కలిపి మొత్తం 5,920 మంది విద్యార్థులు ప్రవేశం పొందడానికి అవకాశాలు ఉన్నాయి.

చిట్టి మెదళ్లకు గొప్ప ఆలోచన


పేపర్‌తో తయారు చేసిన బ్యాగులతో విద్యార్థులు, ఎంఈవో పరమేశ్వర్

సోన్: మండలంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల చిట్టి మెదళ్లకు గొప్ప ఆలోచన కలిగిందని ఎంఈవో తొడిశెట్టి పరమేశ్వర్ అన్నారు. ఇంట్లో ప్లాస్టిక్ సంచులు, వాడిన పాత వార్తపత్రికలు, పనికిరాని కాగితాలతో విద్యార్థులు పేపర్ బ్యాగులు తయారుచేసి పాఠశాలలో శుక్రవారం ప్రదర్శించారు. తమ ఇళ్లల్లో ప్లాస్టిక్ సంచులకు బదులుగా పేపర్ బ్యాగులు మాత్రమే వాడతామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారిని ఎంఈవో అభినందించారు. ఉపాధ్యాయులు రమేశ్‌బాబు, మంగమ్మ, శైలజ, విజయవాణి, రాధ పాల్గొన్నారు.

కలప స్మగ్లింగ్‌పై కఠిన చర్యలు

- చెట్ల నరికివేతపై విచారణకు డీఎఫ్‌వో ఆదేశం

సాక్షి ఎఫెక్ట్

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్, ఖానాపూర్ బీట్లలో పలుమార్లు భారీ టేకు చెట్లను నరికివేసి కలప స్మగ్లింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఖానాపూర్ ఎఫ్ఆర్వో కిరణ్ తెలిపారు. 'రోడ్డు పక్కనే వన మేధం'శీర్షికన శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. చెట్ల నరికివేతపై ఇప్పటికే విచారణ చేపట్టామన్నారు. తమ ప్రాథమిక విచారణలో నలుగురు కలప స్మగ్లింగ్‌కు పాల్పడినట్లు గుర్తించామని తెలిపారు. కాగా, స్మగ్లర్లు తరలించిన కలప విలువ రూ.75 వేలు, నరికి వేసిన చెట్ల దుంగల విలువ రూ.42 వేలు ఉంటుందని తెలిపారు. కాగా, పత్రికలో వచ్చిన కథనానికి నిర్మల్ డీఎఫ్‌వో నాగినిబాను స్పందించారు. కలప స్మగ్లింగ్‌పై సమగ్ర విచారణకు ఆదేశించారు.

కోజ్జన్‌గూడ శివారులో పులి సంచారం?

- కుక్కపై దాడిచేసి హతమార్చిన వైనం


కుక్క కళేబరం

తాంసి: భీంపూర్ మండలం కరంజి(టి), కోజ్జన్‌గూడ శివారుల్లో పులి సంచారం కలకలం రేపింది. కోజ్జన్‌గూడ శివారు సూర్యగుట్ట అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం కుక్కపై పులి దాడి చేసి హతమార్చినట్లు గ్రామస్తులు గుర్తించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. సూర్యగుట్ట అటవీ ప్రాంతం మహారాష్ట్రకు సరిహద్దు ఉండటంతో పులి అక్కడి నుంచి వచ్చిందా లేక చిరుతపులి దాడి చేసి హతమార్చిందా విషయం తెలియాల్సి ఉంది. కాగా, అక్కడ పులి సంచరించినట్లు ఆనవాళ్లు లేవని అర్లి(టి) సెక్షన్ అధికారి మోపత్‌రావు తెలిపారు. కుక్కపై హైనా దాడి చేసి ఉండవచ్చునని అనుమానించారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు


ప్రయాణికులను సన్మానిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం, ఉద్యోగులు

ఆదిలాబాద్: ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో శుక్రవారం మర్యాద దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు ప్రయాణికులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ప్రయాణికుల విషయంలో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రణీత్, డీఎం కల్పన, అకౌంట్స్ ఆఫీసర్ శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుకలో దిగబడిన ట్రాక్టర్

- బయటకు తీసే క్రమంలో ప్రమాదం
- ట్రాక్టర్ డ్రైవర్ మృతి


శేఖర్ మృతదేహం

దండేపల్లి: గోదావరి నదిలో దిగబడిన ఇసుక ట్రాక్టర్‌ను బయటికి తీస్తుండగా ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందాడు. మండలంలోని గుడిరేవు వద్ద శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిరేవు గోదావరినది వద్ద ఇసుక ట్రాక్టర్ నదిలో దిగబడింది. దాన్ని మరో ట్రాక్టర్‌కు టోచన్ కట్టి బయటకు తీసే క్రమంలో మాదాపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మంత్రి శేఖర్(33) మృతిచెందాడు. దిగబడిన ట్రాక్టర్‌ను మరో ట్రాక్టర్‌తో బయటికి లాగేందుకు శేఖర్ రెండింటి మధ్యలో నిలబడి తాడు కడుతున్నాడు. ఈ సమయంలో ముందుకు లాగే ట్రాక్టర్ ఒక్కసారిగా అదుపుతప్పి రివర్స్ రావడంతో మధ్యన ఇరుక్కుపోయి తీవ్రగాయాలయ్యాయి. దీంతో వెంటనే లక్సెట్టిపేట ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందించే లోపు మృతిచెందాడు. ఈవిషయమై ఎస్సై ఉదయ్‌కిరణ్ సంప్రదించగా ప్రమాదం జరిగింది వాస్తవమే కాని, తమకు ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

డ్రైవర్‌కు అస్వస్థత.. అదుపుతప్పిన బస్సు

- మోటార్‌సైకిళ్లు, కార్లను ఢీకొట్టి..
- ఒకరికి తీవ్ర గాయాలు


ప్రమాదానికి గురైన వాహనాలు

మంచిర్యాలక్రైం: ఆర్టీసీ బస్సు నడుపుతున్న డ్రైవర్ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. స్టీరింగ్‌పైనే పడిపోవడంతో బస్సు అదుపు తప్పి రెండు కార్లు, ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని డిపోకు చెందిన బస్సు(టీఎస్ 02 జడ్ 0318) శుక్రవారం మధ్యాహ్నం మంచిర్యాల నుంచి కరీంనగర్‌కు వెళ్తోంది. పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తా, ఐబీ చౌరస్తా రోడ్డు మధ్యలోకి రాగానే డ్రైవర్ లొకిని ఎల్లయ్య బస్సు నడుపుతూనే ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురై స్టీరింగ్‌పై పడిపోయాడు. దీంతో బస్సు అదుపుతప్పి మోర్ మార్కెట్ ఎదురుగా ఉన్న రోడ్డులో పలు వాహనాలను ఢీకొట్టింది. మొదటగా స్కూటీని ఢీకొట్టి పక్కన నిలిపి ఉంచిన రెండు కార్లు, మరో రెండు ద్విచక్ర వాహనాలపైకి దూసుకెళ్లడంతో దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో స్కూటీ నడుపుతున్న చింతపండువాడకు చెందిన చింతపండు సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ ఎల్లయ్య త్వరగానే కోలుకుని బస్సును అదుపులోకి తెచ్చినట్లు ప్రయాణికులు తెలిపారు. అనంతరం డ్రైవర్‌ను కూడా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాద విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంచిర్యాల సీఐ తెలిపారు.

సీఎం కప్ రెజ్లింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో రెజ్లింగ్‌లో ముల్కల్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 60 కిలోల రెజ్లింగ్ పోటీల విభాగంలో పదో తరగతి విద్యార్థి అలుగునూరి అఖిల్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, మొగిళ్ల చందు ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించారు. వీరితోపాటు పీడీ శ్రీకాంత్, పీఈటీ కిరణ్‌లను పాఠశాల ప్రిన్సిపాల్ కుమ్మరి మోహన్, వైస్ ప్రిన్సిపాళ్లు నగేశ్, రమ్యరాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎనిమిది మంది బైండోవర్

కాసిపేట: మండలంలోని వరిపేట శివారులో పేకాట ఆడుతూ పట్టుబడిన ఎనిమిది మందిని అరెస్టు చేసి తహసీల్దార్ భోజన్న ఎదుట శుక్రవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేయగా ముగ్గురిని పట్టుకోగా, పరారీలో ఉన్న ఐదుగురిని అదుపులో తీసుకుని బైండోవర్ చేశారు.

20 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు

- చోరీకి గురైన ఆటో స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఆటో, నిందితులతో పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో గురువారం చోరీకి గురైన ఆటో కేసును టూటౌన్ పోలీసులు 20 గంటల్లోనే ఛేదించారు. పట్టణంలోని నెహ్రూ చౌక్‌లో శుక్రవారం వాహనాల తనిఖీలు చేస్తుండగా రాంనగర్‌కు చెందిన షేక్ అబ్దుల్, షేక్ అమాన్‌లు ఆటోను విక్రయించేందుకు మహారాష్ట్రలోని కిన్వట్‌కు వెళ్తుండగా పట్టుకున్నారు. ఇదివరకే వీరిపై జైనథ్, గాదిగూడ, మావల పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. జల్సాలకు అలవాటుపడ్డ ఇద్దరు చోరీలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. షేక్ అమాన్ గత జూన్‌లో మావల పోలీసు స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో రూ.20వేల దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. వీరిని విచారించగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. కాగా, కేసును ఛేదించిన టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్, ఐడీ పార్టీ నరేశ్, క్రాంతి, గోపాల్, సుధాకర్ రెడ్డి, నరేందర్‌లను ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అభినందించారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

భైంసాటౌన్: అదనపు కట్నం కోసం భార్యను హతమార్చిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ నిర్మల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ తీర్పు ఇచ్చినట్లు పట్టణ సీఐ గోపినాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని పంజేషాగల్లికి చెందిన మహ్మద్ ముజమ్మిల్‌కు నిజామాబాద్‌కు చెందిన నాజియా సుల్తానాతో వివాహం కాగా, మద్యానికి బానిసగా మారి తరచూ అదనపు కట్నం కోసం వేధించేవాడు. దీంతో ఆమె తన పుట్టింటికి వెళ్లి కొంత నగదు తెచ్చేది. వేధింపులు ఎక్కువ కావడంతో పెద్దల సమక్షంలో నచ్చజెప్పారు. అయినా మళ్లీ వేధించడంతో ఆమె తన పుట్టింటి నుంచి డబ్బులు తేలేదు. ఈక్రమంలో ఆమెపై కక్ష పెంచుకున్న భర్త 2020 జనవరి 1న ఉదయం ఆమె ఒంటిపై డీజిల్ పోసి నిప్పంటించాడు. అనంతరం చికిత్స పొందుతూ మృతి చెందింది. శుక్రవారం కేసు విచారణకు రాగా, నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవితఖైదు శిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడినవారికి శిక్ష


బస్టాండ్‌లో క్లీనింగ్ పనులు చేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పాతమంచిర్యాల: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జిల్లా సెకండ్‌క్లాస్ అడిషనల్ మెజిస్ట్రేట్ కె.నిరోష శుక్రవారం శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. నలుగురిని బస్టాండ్ క్లీనింగ్‌లో చేయించాలని, 14 మందికి ట్రాఫిక్ అసిస్టెంట్ విధులు, ఎనిమిది మందికి జరిమానా విధించారని పేర్కొన్నారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి


రాములు (ఫైల్)

భీమిని: మండలంలోని ఖర్జీబీంపూర్ గ్రామానికి చెందిన జనగామ రాములు (37) పాముకాటుతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. అక్కలపల్లిలో పెళ్లి కార్యక్రమం కోసం రాములు గురువారం టెంట్ వేయడానికి వెళ్లాడు. రాత్రి కావడంతో పడుకున్నాడు. అర్ధరాత్రి దాటినా తర్వాత పాముకాటేసింది. అక్కడ ఉన్న స్థానికులు కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలిస్తుండగా మృతిచెందాడు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మృతుడికి కుమార్తె ప్రవస్తి, కుమారుడు నవతేజ్ ఉన్నారు.


చికిత్స పొందుతూ ఒకరు..

కాసిపేట: పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు దేవాపూర్ ఎస్సై అంజనేయులు తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని దేవాపూర్ మద్దిమాడకు చెందిన భూనేని సంజీవ్(40) ఓరియంట్ మాజీ పర్మినెంట్ ఉద్యోగి. సంజీవ్ కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈక్రమంలో తన ఉద్యోగాన్ని భార్యకు పెట్టించాడు. ఎంతకీ కేన్సర్ వ్యాధి నయం కాకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈనెల 18న గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

చింతలమానెపల్లి: జీవితంపై విరక్తితో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని గూడెం గ్రామానికి చెందిన చౌదరి రూపేష్(24) గురువారం మధ్నాహం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. సాయంత్రం తల్లిదండ్రులు వచ్చి చూసేసరికి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వారు వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి చౌదరి మొండి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న మల్లయ్య

జైపూర్: మండలంలోని ఇందారం బస్టాండ్ వద్ద శుక్రవారం రాత్రి బైక్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై నాగరాజు కథనం ప్రకారం ...ఇందారం గ్రామానికి చెందిన సుంకరి మల్లయ్య పనినిమిత్తం బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా శ్రీరాంపూర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న బైక్ అతివేగంగా మల్లయ్యను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన అతన్ని మంచిర్యాలకు తరలించి వైద్యం అందించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో డ్రైవర్‌కు..

భీమిని: కన్నెపల్లి మండలం బోత్తపల్లి శివారు పంట పొలంలో దమ్ము (జంబు) కొడుతున్న ట్రాక్టర్ డ్రైవర్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. బోత్తపల్లికి చెందిన లాట్కురి రవి ట్రాక్టర్‌తో పంట పొలంలో శుక్రవారం దమ్ము కొడుతుండగా అక్కడ 11కేవీ విద్యుత్ తీగలు కర్రలతో వేసి ఉన్నాయి. గమనించని రవి ట్రాక్టర్ వెనుకకు తీస్తుండగా కర్రకు తగలడంతో విద్యుత్ తీగలు అతనిపై ముఖంపై పడింది. తీవ్రగాయాలైన క్షతగాత్రుడిని స్థానికులు ప్రైవేటు వాహనంలో మంచిర్యాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వాహనాల వేలం


వేలం వేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో వివిధ కారణాలతో సీజ్ చేసిన వాహనాలకు శుక్రవారం వేలంపాట నిర్వహించారు. మొత్తం 19 వాహనాలకు 16 వాహనాల వేలం పూర్తయినట్లు జిల్లా సూపరింటెండెంట్ ఎండీ రజాక్ తెలిపారు. వీటి విలువ రూ.1,34,000 నిర్ధారించగా.. రూ.2,07,900లకు వేలం పలికింది. జీఎస్టీతో కలిపి మొత్తం రూ.2,62,282 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఎక్సైజ్ సీఐ లక్ష్మణరావు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.